క్లుప్తంగా

వేములదీవి వెంకన్నకు ప్రత్యేకాలంకరణ



నరసాపురం రూరల్: మండలంలోని వేముల దీవి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారిని శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం ఆఖరి శనివారం సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. గ్రామానికి చెందిన పలువురి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమారాచార్యులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కొవ్వలి ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో ఆలయ ఆవరణలో అన్నసమారాధనను నిర్వహించారు.

ఘనంగా టంగుటూరి జయంతి



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నరసాపురం రూరల్ : విశాలాంధ్ర ఔనత్యం కోసం అహర్నిశలు కృషి చేసిన మహానుభావుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయుడని కొప్పర్రు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఉప్పుగంటి రాజశ్రీ అన్నారు. శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మ గౌరవం కోసం ప్రకాశం పంతులు అవిశ్రాంత పోరాటం చేశారని ఆయన సేవలను గుర్తు చేశారు.

అంగన్‌వాడీల్లో చిన్నారుల సంఖ్య పెంచాలి



పెనుగొండ అంగన్‌వాడీలో ఈసీసీఈడేలో సీడీపీఓ కృష్ణకుమారి

పెనుగొండ: అంగన్ వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలని పెనుమంట్ర ప్రాజెక్టు సీడీపీఓ ఎ.కృష్ణకుమారి అన్నారు. శనివారం పెనుగొండ 8వ అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈడేలో పాల్గొన్నారు. ఆడుతూ, పాడుతూ చిన్నారులకు విద్యాభ్యాసం చెప్పడాన్ని పరిశీలించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించడానికి నెలలో నాలుగో శనివారం ఈసీసీఈ డే నిర్వహిస్తున్నట్లు వివరించారు. మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, పి.సత్యవతి, ఎస్.వాణీ పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత



పాఠశాలకు ప్యూరిఫైర్‌ను అందిస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలకు దాత రాయపూడి కనకజ్యోతి సౌజన్యంతో వాటర్ ప్యూరిఫయర్‌ను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవానీప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి ఈ ప్యూరిఫైర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వరరావు, టి.మధుసూదన్‌రెడ్డి, కె.లీలాకుమారి, జి.నందిని పాల్గొన్నారు.

'అర్జున్ చక్రవర్తి' చిత్ర బృందం సందడి

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 'అర్జున్ చక్రవర్తి' చిత్రబృందం సందడి చేసింది. చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా నటీనటులు విజయరామరాజు, సిజరోజ్ శనివారం విద్యార్థులతో కలిసి సరదాగా గడిపారు. అనంతరం చిత్రనిర్మాత గుబ్బల శ్రీనుమాట్లాడుతూ సాధారణ యువకుడు దేశం గర్వించే గొప్ప క్రీడాకారుడిగా ఎలా ఎదిగాడో అర్జున్ చక్రవర్తి చిత్రంలో చూపించినట్లు చెప్పారు. ఈ చిత్రానికి దర్శకుడిగా విక్రాంత రుద్ర, మ్యూజిక్ డైరెక్టర్‌గా విఘ్నేష్ భాస్కరన్ పనిచేయగా, దయానంద రెడ్డి, దుర్గేష్ నటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యావేత్త గుబ్బల తమ్మయ్య, వి చంద్రశేఖర్, కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్‌ల అవస్థలు తీరేదెన్నడు?



వెలమగూడెం వంతెనకు అప్రోచ్ దుస్థితి



బ్యాంక్ స్ట్రీట్‌లో రోడ్డు పరిస్థితి



ప్రమాదకరంగా బొర్రావారి తోటలో రోడ్డు

గగ్గోలు పెడుతున్న వాహనదారులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో అప్రోచ్‌లు సరిగా లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మునిసిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా తూతూ మంత్రంగా అప్రోచ్‌లు కలపడం వల్ల అవి వారం రోజులు కూడా నిలబడడంలేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ఈ అప్రోచ్‌లు కలిపే రోడ్డులు కూడా బాగా ఎత్తుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల ముందు చక్రాలకు రోడ్డు గట్టిగా తగులుతుండడం వల్ల టైర్లు పోతున్నాయని అంటున్నారు. అప్రోచ్ సరిగ్గా లేకపోవడం వల్ల వాహనాలను క్రాస్‌గా ఎక్కించడంతో వర్షం కురిస్తే జారి పడిపోవడం లేదా ఎత్తు సరిగ్గా ఎక్కలేకపోవడంతో వాహనం వెనక్కి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇలా పట్టణంలో వెలమగూడెం, మెయిన్‌రోడ్డులో బ్యాంక్ స్ట్రీట్ వద్ద, అచ్చుగట్లపాలెం బొర్రావారి లేఅవుట్‌లో ఇలా పలు ప్రాంతాల్లో ఉన్న అప్రోచ్‌ల వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు.

నాణ్యత లేమితో సమస్యలు

అప్రోచ్‌లు కలిపే సమయంలో నాణ్యత పాటిస్తే అవి కొంతకాలం నిలబడుతాయని తూతూ మంత్రంగా వేస్తుండడంతో ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు రద్దీ సమయంలో ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. రాత్రి సమయాల్లో ఈ రోడ్లు సరిగా కనిపించక ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. మునిసిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి నాణ్యతతో కూడిని రోడ్డు వేయడం వల్ల అప్రోచ్‌ల ఇబ్బందులు తొలగుతాయని స్థానికులు కోరుతున్నారు.

త్వరలో అప్రోచ్‌లు వేస్తాం

అప్రోచ్‌లు వేయాలని స్థానికులు నుంచి ఫిర్యాదులు అందాయి. వెలమగూడెం వంతెనకు అప్రోచ్ ఏర్పాటు చేయడానికి అంచనాలు వేశాం. త్వరలో పనులు పూర్తి చేస్తాం. ఇంకా పట్టణంలో ఎన్ని ఉన్నాయో అవి కూడా పరిశీలించి వాటికి కూడా అతి త్వరలో అప్రోచ్‌లు పూర్తి చేస్తాం.

– రాజ్‌కుమార్, డీఈ, పాలకొల్లు మున్సిపాలిటీ

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు

నరసాపురం: జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబర్ 13న నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి.గంగరాజు పోలీసులకు సూచించారు. శుక్రవారం స్థానిక కోర్ట్ హాల్లో పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌అదాలత్ ద్వారా కక్షిదారులకు సమన్యాయం అందించడంలో పోలీస్ అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. రాజీ పడతగిన కేసులను ముందుగా గుర్తించి ఇరుపార్టీలకు నోటీసులు ఇచ్చి మధ్యవర్తిత్వం నిర్వహించడం వల్ల కొన్ని కేసులను రాజీ చేయవచ్చునని చెప్పారు. లోక్ అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించాలని సూచించారు. ఇప్పటికే గ్రామాలలో పారా లీగల్ వలంటీర్స్ ద్వారా లోక్ అదాలత్ ప్రాముఖ్యతను తెలియజేస్తున్నామన్నారు. కోర్టు సముదాయంలో ప్రతిరోజూ జరుగుతున్న మధ్యవర్తిత్వం కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎస్.రాజ్యలక్ష్మి, నరసాపురం పట్టణ, గ్రామీణ సీఐలు బి.యాదగిరి, దుర్గాప్రసాద్, ఎక్సైజ్ ఎస్సై ఖాసీం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్ధార్థ, కోర్ట్ లైజన్ అధికారి సూర్య భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రకు కృషి చేయాలి



సిద్ధాంతంలో ప్రమాణం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనుగొండ: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్మాణానికి కృషి చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టరు బి.సుజాత రాణీ అన్నారు. శనివారం సిద్ధాంతంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో లబ్ధిదారులకు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రాముఖ్యతను వివరించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా విడనాడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, ప్రీస్కూల్‌లో నమోదు సంఖ్య పెంచాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ అందిస్తున్న పౌష్టికాహారంపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎ.కృష్ణకుమారి, సూపర్‌వైజర్ రూతుకుమారి పాల్గొన్నారు.

ఆచంటలో

ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ పై ఎంపీడీవో బి.కృష్ణమోహన విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు భోజనం చేయడానికి ముందు చేతులు ఏ విధంగా శుభ్రపరచుకోవాలో ఎంపీడీవో అవగాహన కల్పించారు. అలాగే ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ వి.శివరంజనీ ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

ప్రకృతి సేద్యంతో భూమికి మేలు



పోడూరులో ప్రకృతి వ్యవసాయంలో డ్రోన్ స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రకృతి వ్యవసాయంతో రైతుకు లాభదాయకంగా ఉండడంతో పాటు, భూమికి మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం డీసీ అరుణ అన్నారు. శనివారం పోడూరులో ప్రకృతి వ్యవసాయంలో బయో కల్చర్ స్ప్రేయింగ్‌పై అవగాహన కల్పించారు. రైతుల పొలంలో బయో కల్చర్స్, కోడిగుడ్డు, నిమ్మరసం కలిపి డ్రోన్ సహాయంతో స్ప్రేయింగ్ చేయించారు. దీని వల్ల మొక్కలకు పూర్తిస్థాయిలో కషాయాలు అందుతాయన్నారు. తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో డ్రోన్‌తో స్ప్రేయింగ్ చేసుకోవచ్చన్నారు. మొక్కల ఎదుగుదలకు, క్రిమికీటకాలను నివారించడానికి ఉపయోగం పడతాయన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ఈరన్న గౌడ్, ఏఈఓ చిరంజీవి, ఎంఐ వెంకటేశ్వరరావు, వీఏఏ నాగలక్ష్మీ, కేతా అశ్విని, రైతులు కుసుమే భాస్కరరావు, కోట అచ్చుతరావు, యల్లమెల్లి కృపావరం, కుసుమే పెద్దిరాజు, కారేం జాన్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకచవితి వేడుకలపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్

యలమంచిలి: వినాయక చవితి ఉత్సవాలు పర్యావరణహితంగా జరిగేలా అధికారులంతా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, పర్యావరణ హితంగా, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వినాయక చవితి ఉత్సవాలు జరిగేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాల శిబిరాల వద్ద వైద్య సదుపాయాలు కల్పించాలని, పారిశుధ్య చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పందిరి ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీస్, పంచాయతీ, అగ్నిమాపక శాఖ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. పందిరి అలంకరణలో ప్లాస్టిక్ పదార్థాలను వాడరాదని, పర్యావరణహిత పదార్థాలను మాత్రమే వాడాలని ఆయన చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వినాయక చవితి ఉత్సవాలు విజయవంతం అయ్యేలా చూడాలని తహసీల్దార్ పవన్ కోరారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్ ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్, గ్రామ కార్యదర్శులు మాదాసు హరిప్రసాద్, పీతల రాజశేకర్, దూనబోయిన శ్రీనివాస్, రామారావు, హెడ్ కానిస్టేబుల్ శాంసన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయవాడలో విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర సదస్సు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో ఉన్న వికలాంగుల పింఛన్ వెరిఫికేషన్‌లో భాగంగా అనర్హులను తొలగించడంలో తప్పులేదని, కానీ అర్హులను కూడా తొలగించడం అన్యాయమని వికలాంగుల సంఘం సభ్యులు కె.సురేష్, ఎం.సూరిబాబులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆదివారం విజయవాడలో ఏపీ విభిన్న ప్రతిభావంతుల జేఏసీ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరూ శనిఆవరం విలేకరులతో మాట్లాడుతూ పుట్టుకతో వికలాంగులైన వారికి కూడా అనర్హుడిగా నోటీసులు జారీ చేయడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. అర్హులైన వికలాంగులకు పింఛన్ పునరుద్ధరణ చేయాలని వికలాంగులకు 2016 చట్టం ప్రకారం 4 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, విద్య, ఉద్యోగ, ఉపాధి పంగాల్లో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రోస్టర్ విధానం 10కి తగ్గించాలని అన్నారు. డిమాండ్ల సాధన కోసం విజయవాడలో జేఏసీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో ఉదయం 10 గంటలకు సదస్సు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

వీరవాసరం: నౌడూర్‌లోని కేఎస్‌ఎన్ఆర్ కాలేజ్ విద్యార్థులు జోనల్ స్థాయి బాక్సింగ్ సెలక్షన్లలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ కేవీడి ప్రసాద్ రెడ్డి శనివారం తెలిపారు. కాకినాడలో జరిగిన జోనల్ స్థాయి బాక్సింగ్ సెలక్షన్లో బి నదియా, వి దేవి గోల్డ్ మెడల్ సాధించగా, ఎస్ భవ్య, ఎన్. అమృతలక్ష్మి, జి పూజిత, కే మోహన్ అంజలిశ్రీ, ఐ.పద్మావతి సిల్వర్ మెడల్ సాధించారని చెప్పారు. బాలుర విభాగంలో కే గణేష్, ఏ.గిరినాగసాయి, బి సత్య ప్రకాష్ సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కోచ్ చిరంజీవి, మాధవిలను ప్రిన్సిపాల్ బి శేషు అభినందించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఉండి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా అన్నారు. శనివారం సాయంత్రం చెరుకువాడ శివారు ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ భారం కాదని, బాధ్యత అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ లేకపోవడం వలనే అనేకమంది మృత్యువాత పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఆన్‌లైన్ లావాదేవీలు

చిల్లర సమస్య లేదంటున్న వ్యాపారులు



చిల్లర దుకాణంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్



క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపు చేసిన దృశ్యం (ఫైల్)

నరసాపురం రూరల్: గతంలో ఇంటి నుంచి బయటకు వచ్చే ముందు జేబులో డబ్బు పెట్టుకుని వచ్చేవాళ్లం. ఇప్పుడు కాలం మారింది. టీ తాగాలన్నా మార్కెట్లో సరుకులు, కూరగాయలు కొనుగోలు చేయాలన్నా జేబులో ఓ స్మార్ట్ ఫోన్, బ్యాంకు ఖాతాలో డబ్బు ఉంటే చాలు. లావాదేవీలను సులభంగా చేసుకోవచ్చు. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాల చెంతకు వచ్చేశాయి. పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే, క్యూఆర్ కోడ్ స్కానర్ లేకుండా ఏ వ్యాపారీ కనిపించడం లేదు.

8 వేల దుకాణాలు

ప్రస్తుతం స్కానర్లు చిరు వ్యాపారులకు సైతం దుబాటులోకి వచ్చాయి. డిజిటల్ లావాదేవీలు పెరగడంతో థర్డ్ పార్టీ నిర్వాహకులు అన్ని దుకాణల వద్దకు వెళ్లి పేమెంట్ స్కానర్లు, స్పీకర్లు పెడుతున్నారు. నరసాపురం నియోజకవర్గంలో మొత్తం టీ, టిఫిన్, తోపుడు బండ్లు, ఇస్త్రీ, చిల్లర దుకాణాల వంటివి దాదాపు 8 వేల వరకు ఉంటాయి. ఆయా దుకాణాల్లో ప్రతిరోజూ వేలాది రూపాయల డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి.

కోవిడ్‌తో మార్పులు

పెద్ద నోట్ల రద్దు అనంతరం ఆన్‌లైన్ లావాదేవీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. మొదట్లో పెద్ద పెద్ద పట్టణాల్లో మాత్రమే ఆన్‌లైన్ చెల్లింపులు జరగ్గా.. కొన్ని కొన్ని అపోహలతో స్మార్ట్ చెల్లింపులు గ్రామీణ ప్రాంతాలకు చేరలేదు. 2019 కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు గణనీయంగా పెరిగి చెల్లింపుల్లో మార్పులు వచ్చాయి. పేమెంట్ యాప్‌లతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్, గ్యాస్, విద్యుత్ బిల్లులు, ఫుడ్ డెలివరీ, ఇతర అవసరాలకు ఆన్‌లైన్ ద్వారానే నగదు చెల్లిస్తున్నారు.

స్పీకర్‌తో అక్రమాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసానికి గురయ్యే అవకాశం ఉంది. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరుకులను కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి అమౌంట్ బదిలీ చేస్తారు. ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్ ఫుల్ మెస్సేజ్‌ను దుకాణదారుడికి చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే ఇటువంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్సులు అందుబాటులోకి వచ్చాయి. ఆన్‌లైన్ చెల్లింపులు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారుకు ఖాతాకు జమైందో వాయిస్ రూపంలో వినిపిస్తుంది. అయితే ఆన్‌లైన్ చెల్లింపులు ఎంత సౌకర్యంగా వినియోగదారులు, వ్యాపారులూ నిత్యం అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

చిల్లర సమస్య తప్పింది



ప్రస్తుతం జేబులో డబ్బు లేకపోయినా బ్యాంకు ఖాతాలో డబ్బు ఉంటే క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేస్తున్నాం. గతంలో కొనుగోలు చేసిన సరుకుల ధర కన్నా ఎక్కువ సొమ్ము ఇస్తే చిల్లర లేదనే సాకుతో వ్యాపారి మనకు అవసరం లేకపోయినా షాపువాళ్లు వేరే సరుకులను అంటగట్టేవారు. ఆన్‌లైన్ డిజిటల్ చెల్లింపులతో ప్రస్తుతం చిల్లర సమస్య తప్పింది.

– గంధం జయకుమార్, కొనుగోలుదారుడు, నరసాపురం

డిజిటల్ చెల్లింపులే ఎక్కువ



నేను కొన్నేళ్లుగా పాల వ్యాపారం చేస్తున్నాను. గతంలో నగదు లావాదేవీలు ఎక్కువ జరిగేటప్పుడు చిల్లర సమస్య ఏర్పడేది. చిల్లర ఇవ్వలేకపోతే కొనుగోలుదారులు సరుకును వదిలేసి వేరే దుకాణానికి వెళ్లిపోయేవారు. ప్రస్తుతం నగదురహిత లావాదేవీలే ఎక్కువగా జరుగుతున్నాయి. నా ఖాతాకు ఎంత మొత్తం వచ్చిందో కూడా వాయిస్ రూపంలో చెబుతోంది.

– నున్నబోయిన ఉమా మహేశ్వరరావు, పాల వ్యాపారి, నరసాపురం

వృద్ధులకు భోజనం పంపిణీ

పెనుగొండ: మానవత ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా భోజనాలు అందించారు. శనివారం పెనుగొండలోని ఆక్స్‌ఫర్డ్ స్కూలు వద్ద మానవత అధ్యక్షుడు కొమ్ముల రామకృష్ణ సౌజన్యంతో అందించారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు కర్రి నరేంద్ర రెడ్డి, బచ్చు నరసింహరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ పొలు మృతి



గొట్టుముక్కల పొలు

పెనుగొండ: పోడూరు మండలం గుమ్ములూరు మాజీ సర్పంచ్ గొట్టుముక్కల పొలు శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పొలు మృతిపై మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు పిల్లి నాగన్న, ఎంపీటీసీ సభ్యుడు అంబటి సుధాకర్, సీడ్ కార్పొరేషన్ మాజీ డైరక్టరు పోతుమూడి రామచంద్రరావు తదితరులు సంతాపం తెలిపారు.

లోఓల్టేజీ నివారణకు చర్యలు



మేడపాడులో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎలక్ట్రికల్ డీఈ రామకృష్ణ

యలమంచిలి: గ్రామాల్లో లోవోల్టేజి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎలక్ట్రికల్ డీఈ రామకృష్ణ చెప్పారు. మేడపాడు పంచాయతీ గరువు, ఆర్యపేట పంచాయతీ పెదపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి తమ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. ఆయన వెంట ఏఈ వి చండీ కిరణ్ ఉన్నారు.

పీసీపీఎన్‌డీటీ చట్టం సలహా సంఘం సమావేశం

భీమవరం (ప్రకాశంచౌక్): పీసీపీఎన్‌డీటీ చట్టం అమలులో భాగంగా భీమవరం డివిజన్ పరిధి సలహా సంఘం సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ సీహెచ్.ధనలక్ష్మి అధ్యక్షతన జరిగింది. పీసీపీఎన్‌డీటీ చట్ట పరిధిలో రిజిస్టర్ అయి పనిచేస్తున్న స్కానింగ్ సెంటర్ల పనితీరు, కొత్తగా రెండు స్కానింగ్ సెంటర్ల నమోదు ప్రక్రియ, గతంలో రిజిస్టర్ అయిన రెండు స్కానింగ్ సెంటర్లలో చేసుకున్న మార్పులపై చర్చించారు. డివిజన్ పరిధిలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయడానికి కృషి చేయాలని కమిటీ తీర్మానించింది. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లలు వైద్య నిపుణులు డా.కె.ప్రవీణ్ కుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యం.వెంకటేశ్వర్లు, సంజీవని వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: కారు, మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ తెలిపిన వివరాల ప్రకారం తాడేరు గ్రామానికి చెందిన చుండూరు లీలా వెంకట శివరామ్ (19) ఈనెల 11న మోటారు సైకిల్‌పై వెళుతుండగా తాడేరురోడ్డులోని జడ్డూ బ్రహ్మాజీ వృద్ధాశ్రమం సమీపంలో కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివరామ్‌ను చికిత్స కోసం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శివరామ్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణాజీ చెప్పారు.

రేపు వాహనాల బహిరంగ వేలం

భీమవరం: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో జప్తు చేసిన ద్విచక్ర వాహనాలను ఈ నెల 25న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎన్నార్ కళాశాల రోడ్డులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఈ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

పాలకోడేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.గీతాబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం అయిన మహిళను హాస్పటల్లో అందుతున్న సేవలు గురించి, సిబ్బంది ప్రవర్తన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల ప్రేమ పూర్వకంగా వ్యవహరించి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట వైద్యాధికారులు గులాబ్ రాజ్ కుమార్, స్వర్ణ నిరంజని, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.

మానవత్వానికి ప్రతీక రక్తదానం

భీమవరం: మానవత్వానికి ప్రతీక రక్తదానమని, ప్రతిఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చునని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా సుంకర పద్దయ్య వీధిలోని బ్రహ్మకుమారిస్ ఓం శాంతి యోగ భవనంలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు.